# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 07 ఆగస్టు 2024

తెలుగు దినపత్రిక




- ఎమ్మెల్యే విజయుడికి అవమానంపై కేటీఆర్ ఆగ్రహం..
- ఇదేం రూల్..? అంటూ కాంగ్రెస్ సర్కార్ పై అసహనం..
- ప్రధాన కార్యదర్శి సమాధానం చెప్పాలని డిమాండ్..

# ప్రొటోకాల్ మారుద్దా..?

## అలంపూర్.. అబాసు పాలు..

**జనపదం, బ్యూరో:** అలంపూర్ ఎమ్మెల్యే విజయుడితో గద్వాల జిల్లా ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ప్రతినిధులకు ప్రతిరోజూ అవమానాలేనా..? అని నిలదీశారు. ప్రజల చేతిలో తిరస్కరించినబడిన కాంగ్రెస్ నాయకులను అధికారిక సమావేశాలు, కార్యక్రమాలకు ఎందుకు, ఏ విధానంలో ఆహ్వానిస్తారో ప్రధాన కార్యదర్శి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అవమానించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోటోకాల్ విధానాలను ఏమైనా మార్చిందా? కనీసం ఆ విషయమైన చెప్పాలన్నారు. ప్రజా (తరువాయి 3పేజీలో)



## కవిత విడుదలపై కుట్రలా..?

## అర్థాంతరంగా పిటిషన్ రద్దు

### వ్యూహాత్మకమా..,.రాజకీయమా..?

### పై కోర్టుకెళ్లినా మరింత ఆలస్యం

బెయిల్ ఎప్పుడొస్తుంది..? ఇప్పట్లో జరిగేనా, ఇంకా ఆగాల్సిందే.? న్యాయవాదులతో జరుపుతున్న చర్చలేంటి.? అసలు ఇదంతా కావాలని చేస్తున్నారా..? ఒకవేళ అదే నిజమైతే అలాంటి అవసరం ఎవరికుంది...? ఒకవైపేమో తట్టుకునే ధైర్యం లేక తండ్రేమో బాధతో అటు మొఖాన చూసింది లేదు., ఎంతసేపు అటు అన్నా, ఇటు బావ., తదితరులు కవితను తీసుకొచ్చే యత్నాలు మాత్రం చేస్తూనే ఉన్నారు. ఏదిఏమైనా ఈ విడత తప్పకుండా బెయిల్ వస్తుందనుకుంటున్న వేళ ఉన్నట్టుండి పిటిషన్ రద్దు చేసుకోవడం వెనక అంతర్యమేమిటో అర్థం కాకుండా ఉంది. అసలు లిక్కర్ కేసులో జైల్లో గడుపుతున్న కవిత ఎప్పటికి బయటకు వస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది. ఆగస్టు 5వ తేదీన వాదనలు ఉండగా ఎమ్మెల్సీ తరపున న్యాయవాదులు హాజరుకాకపోవడంతో బెయిల్ పై జరుగుతున్నదేమిటో ఎటూ అంతుచిక్కకుండా ఉంది.

# బెయిలెప్పుడో...?

**జనపదం, ఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టులో ఉన్న బెయిల్ పిటిషన్ ను విత్ డ్రా చేసుకున్నారు. కేటీఆర్, హరీష్ రావు సహా బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీ వెళ్లి న్యాయవాదులతో ఏదేదో మాట్లాడారు. హైకోర్టు లో ఇక బెయిల్ రాదని, సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రాథమికంగా నిర్ధారించినా ఆ పిటిషన్ విచారణ కొచ్చేసరికి ఇంకా వేచిచూడాల్సిందే. అప్పటి వరకు కవిత జైల్లోనే నలిగిపోవాల్సిందేనా అని అనుమానిస్తున్నారు.

**కుట్రలా..?**

ఎమ్మెల్సీ కవితను ఇంకా జైల్లో మగ్గేలా కుట్రలు చేస్తున్నారా.., లేక సంప్రదింపులు చేస్తన్నారా.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు ఉన్నారు. ఇందులో రాజకీయ కోణం ఏముందనే చర్చ జాగృతి వర్గాల్లో కూడా జోరుగా సాగుతోంది. నాలుగున్నర నెలల నుండి జైల్లో గడుపుతున్న ఎమ్మెల్సీ కవితను తండ్రి కేసీఆర్ ఇంత వరకు చూసింది లేదు. అప్పుడో ఇప్పుడో అన్నయ్య కేటీఆర్, బావ హరీష్ రావు, ఇతర ముఖ్య నాయకులు వెళ్లి చూడడం ధైర్యంచెప్పి రావడం తప్ప జరుగుతున్నదేమీ లేదు. ఎవరెన్ని చెప్పినా కవిత మాత్రం తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. తన పిల్లలు, కుటుంబానికి దూరమై నరకం చూస్తున్నట్టుగా బాధపడుతున్న సందర్భాలున్నాయి. ఇంత పరపతి, అవకాశాలు ఉన్నా తనకు ఎందుకు బెయిల్ రావడం లేదో అర్థం కాక వెళ్లిన వారిని గట్టిగా అడుగుతున్నట్టు అటు బీఆర్ ఎస్ పార్టీ, (తరువాయి 2పేజీలో)

## 15న మూడో మాఫీ



- వైరాలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 6 వేల మంది రైతులకు, రూ.6 వేల కోట్లు..
- ప్రతిపక్షాలవి అనవసర ఆరోపణలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

3



## జైల్లో కోళ్లు..

- వేలం వేసిన అధికారులు...
- పోటీపడి పాడిన కొనుగోలుదారులు

2



## కిషనన్నకో గుస్సా ఆగయా..

- స్థానిక ఎన్నికలకు బీజేపీ యాక్షన్ ప్లాన్
- సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా..
- అసహనం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అయ్యయ్యో.. కిషనన్నకు కోపం తెప్పిత్తిరి గదా. అన్నా.. ఎంతో ఆవేశంగా స్థానిక సమరంలో సాగడం ఎలా అనే విషయంపై క్లాస్ చెప్పుదామనుకుంటే అసెంబ్లీల అడుగుపెట్టినోళ్లంతా (బీజేపీ ఎమ్మెల్యేలు) సమావేశానికి ఎగనామం పెట్టే. చీటీ రాసుకొచ్చి, గొంతు సవరించుకుని నొక్కినొక్కి చెప్పుదామనుకున్న స్క్రిప్ట్ ను అటు చదువలేక, ఇటు మడిచి పెట్టుకోలేక వచ్చినోళ్ల ముందట మమ అనిపించి అసహనంగా ఎల్లిపాయె. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో జరిగిన ఈ పరిణామం పార్టీలో చర్చనీయాంశం అయింది. - జనపదం, హైదరాబాద్

3



## హైదరాబాద్ కు ఆర్సీసీఎం..

- అమెరికా తర్వాత భాగ్యనగరానికి కంపెనీ..
- విస్తరణకు రాష్ట్ర సర్కార్ తో అంగీకారం..
- స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగాలు
- ఐటీలో వృద్ధే సర్కార్ లక్ష్యమన్న సీఎం రేవంత్
- బృందంతో కలిసి యూఎస్ లో పర్యటన..
- ఆర్సీసీఎం సీఈవో గౌరవ్ సూరీతో ఒప్పందం..

3



## అద్వానీకి అస్వస్థత..

జనపదం, ఢిల్లీ: భారతీయ జనతా పార్టీ కురువృద్ధుడు, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ అద్వాని (96) మళ్లీ అస్వస్థతకు గురైనట్టు సమాచారం. మంగళవారం ఆయన్ను ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఎల్‌కే అద్వాని వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. జూన్ చివర్లో కూడా ఆయన అనారోగ్యానికి గురవడంతో ఎయిమ్స్‌లో చేర్చారు. యూరాలజీ వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. ఆ తర్వాత జూలై మొదటివారంలో మరోసారి అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు ఢిల్లీ అపోలో ఆస్పత్రిలో రెండు రోజుల పాటు చికిత్స తీసుకున్నారు.

# ఇండియాలోనే సేఫ్..

| బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి బ్రిటన్ షాక్.. | లండన్‌లో స్థిరపడాలనుకున్న షేక్ హసీనా | తమ వలస చట్టాలు ఒప్పుకోవన్న హోం మంత్రిత్వ శాఖ |
|---|---|---|

| అగమ్యగోచరంగా.. హసీనా పరిస్థితి | ఏ దేశంలో ఆశ్రయం పొందుతారనే అంశంపై ఉత్కంఠ | బంగ్లాదేశ్ లో చల్లారని అల్లర్లు.. | సైనికుల ఆధీనంలో దేశం.. |
|---|---|---|---|



**జనపదం, న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా.. తన పదవి, దేశం, సామ్రాజ్యం అన్నీ వదిలేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. బ్రతుకు జీవుడా అంటూ భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే ఆమెకు అడుగడుగునా ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. ఢాకాలోని ప్రధాని ప్యాలెస్‌ను ఆందోళనకారులు చుట్టుముట్టడం, 45 నిమిషాల్లో పదవికి రాజీనామా చేసి.. పారిపోవాలని బంగ్లాదేశ్ ఆర్మీ అల్టిమేటం ఇవ్వడంతో తన సోదరి షేక్ రెహానాతో కలిసి భారత్‌కు ఆగమేఘాల మీద ప్రత్యేక ట్రాన్స్ పోర్టు విమానంలో ఇండియాకు వచ్చారు. అయితే షేక్ హసీనా.. ఢిల్లీ నుంచి లండన్ వెళ్లి అక్కడే స్థిర పడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బ్రిటన్‌లో ఆశ్రయం కల్పించాలని అక్కడి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసుకున్నారు. అయితే ఆమె విన్నపంపై స్పందించిన బ్రిటన్ ప్రతినిధి షేక్ హసీనా రాకను నిరాకరించారు. దీంతో షేక్ హసీనా మరికొంత కాలం భారత్‌లోనే ఉండనున్నారు.

**చట్టాలు ఒప్పుకోవు..**

బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ నేతృత్వంలోని ప్రభుత్వం కుప్పకూలిపోవడంతో షేక్ హసీనా ప్రధాని (తరువాయి 2లో)



నాగార్జునసాగర్‌కు పోటెత్తిన వరద..

22 గేట్లను ఎత్తిన అధికారులు

3

## రెండు రోజులు భారీ వర్షాలు..

ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

3

# మీకు భారత్‌లోనే సేఫ్..

**(మొదటి పేజీ తరువాయి)** పదవికి రాజీనామా చేసి.. రెండు రోజులుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే ఢిల్లీ నుంచి లండన్ వెళ్లడానికి ఆమె వచ్చారని సోమవారం నుంచి ప్రచారం జరుగుతోంది. కానీ పరిస్థితులు మాత్రం ఆమెకు అనుకూలించడం లేదు. బ్రిటన్‌లో ఆశ్రయం పొందేందుకు షేక్ హసీనా చేసిన విజ్ఞప్తికి అక్కడి నుంచి ప్రతికూల స్పందన వచ్చింది. ఒక వ్యక్తి ఆశ్రయం కోసం లేదా శరణార్థిగా తమ దేశానికి వచ్చేందుకు తమ వలసచట్టాలు అంగీకరించవని బ్రిటన్ హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాజాగా ఓ మీడియాకు వెల్లడించారు. ఏదైనా అవసరంలో ఉన్న వారికి రక్షణ కల్పించే విషయంలో బ్రిటన్‌కు ఎంతో మంచి రికార్డు ఉందని.. ఎంతోమందికి అలా రక్షణ కల్పించినట్లు ఆయన తెలిపారు. అయితే ఆశ్రయం కోరుతూ లేదా తాత్కాలిక శరణార్థిగా ఒక వ్యక్తి యూకే వచ్చేందుకు అనుమతించేలా తమ వలస చట్టాల్లో ఎలాంటి నిబంధన లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ రక్షణ కోరేవారు.. ప్రస్తుతం వారు ఉంటున్న సురక్షిత ప్రదేశంలోనే ఆశ్రయం పొందాలని.. అదే వారి రక్షణకు మంచి మార్గమని పేర్కొన్నారు. షేక్ హసీనా బ్రిటన్‌లో ఆశ్రయం పొందడం కంటే ఇప్పుడు ఉన్న భారత్‌లోనే ఆమె ఉండాలని పరోక్షంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### సోదరి కూతురు బ్రిటన్ పార్లమెంట్ సభ్యురాలు

షేక్ హసీనా సోదరి షేక్ రెహానా.. బ్రిటన్ పౌరురాలు. పైగా షేక్ రెహానా కుమార్తె తులిప్ సిద్దిఖీ.. ప్రస్తుతం బ్రిటన్‌లో అధికారంలో ఉన్న లేబర్ పార్టీ తరఫున పార్లమెంట్ సభ్యురాలిగా కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రభుత్వం తనకు సులభంగా ఆశ్రయం ఇస్తుందని భావించిన షేక్ హసీనా.. ఆ దేశాన్ని సాయం కోరినట్లు తెలుస్తోంది. అయితే అక్కడి నుంచి ఆశించిన ఫలితం రాకపోవడంతో.. హసీనా తన కుటుంబ సభ్యులు నివసిస్తున్న అమెరికా, బ్రిటన్, ఫిన్‌లాండ్, భారత్‌ల్లో కంటే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా వంటి దేశాల్లో ఆశ్రయం పొందే అవకాశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం.



కుటుంబ సభ్యులు అమెరికా, బ్రిటన్, ఫిన్లాండ్ దేశాల్లో ఆశ్రయంపై ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది.

### సైనికుల ఆధీనంలో బంగ్లాదేశ్..

రిజర్వేషన్ల గొడవతో అట్టుడికిన బంగ్లాదేశ్ చివరకు సైనిక పాలనలోకి వెళ్లింది. ఆందోళన కారులకు తలొగ్గిన ప్రధాని షేక్ హసీనా గద్దె దిగారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొన్ని నెలల క్రితం శాంతి యుతంగా మొదలైన నిరసనలు క్రమక్రమంగా తీవ్ర పరిణామాలకు దారితీశాయి. షేక్ హసీనా దేశం వదలి పారిపోయినా.. ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. ఇప్పటికే ఆ పార్టీ ఎంపీ, క్రికెట్ టీమ్



మాజీ కెప్టెన్ ఇంటిని విధ్వంసకారులు తగుల బెట్టారు. తాజాగా జషోర్ జిల్లాలో ఓ హోటల్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టిన ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. అయితే మృతుల్లో ఒక ఇండోనేషియా పౌరుడు ఉన్నాడని స్థానిక మీడియా వెల్లడించింది. ఆందోళనకారులు నిప్పు పెట్టిన జబీర్ ఇంటర్నేషనల్ హోటల్ అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి షాహిన్ చక్లాదర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు.

### ఫర్నీచర్ ధ్వంసం..

షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వదిలి వెళ్లిన తర్వాత ఆందోళన కారులు ఆమె ఇంట్లోకి చొరబడ్డారు ఇంట్లో ఉన్న ఫర్నీచర్, ఇతర వస్తువులను పగలగొట్టారు. అందిన కాడికి అందిన వస్తువులను ఎత్తుకెళ్లారు. మరోవైపు, బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంతో అలర్ట్ అయిన భారత్ బంగ్లాదేశ్ బార్డర్‌లో హై అలర్ట్ ప్రకటించింది. సరిహద్దు గ్రామాల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. మరోవైపు, భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు రెగ్యులర్‌గా నడిచే అన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఇండియన్ రైల్వే ప్రకటించింది.



### హసీనా వచ్చిన విమానం.. బంగ్లాకు

షేక్ హసీనా వచ్చిన సీ–130 జే మిలిటరీ విమానం తిరిగి బంగ్లాకు వెళ్లింది. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆమె ప్రత్యేక సీ–130 ట్రాన్స్‌పోర్ట్ విమానంలో ఇండియాకు రాగా, ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో ఆమె దిగారు. అయితే బంగ్లాకు బయలుదేరిన ఆ విమానం లో హసీనా లేనట్లు అధికారులు చెప్పారు. ఏడుగురు మిలిటరీ సిబ్బందితో .. హిండన్ ఎయిర్‌బేస్ నుంచి బంగ్లా ఎయిర్ ఫోర్స్ విమానం బయలు దేరినట్లు తెలిపారు.





## అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం..

### డీజీపీ డాక్టర్ జితేందర్.. నేరాల నివారణపై రివ్యూ

**జనపదం, హైదరాబాద్:** అసాంఘిక శక్తులు, రౌడీలపై కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి చర్యలైనా తీసుకోవడానికి వెనకాడొద్దని డీజీపీ ఆదేశించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఆఫ్ ఇయర్ క్రైమ్ రివ్యూ నిర్వహించగా అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల సీపీలు, జోన్ల ఐజీలు, రేంజ్ డీఐజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ పోలీసు ఉన్నతాధికారులకు నేరాల నియంత్రణకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై జరిగే దాడులు, సైబర్, డ్రగ్స్ అక్రమ రవాణా వంటి వాటి విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించొద్దన్నారు. సమాజంలో అసాంఘిక చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. డయల్ 100 కు రెస్పాండ్ అయ్యే సమయాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 33 కేసుల్లో నేరస్తులకు లైఫ్ కన్విక్షన్లు పడేలా చర్యలు తీసుకున్న 36 మంది అధికారులు, 30 మంది ప్రాసిక్యూటర్లకు డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రతినెలా డీజీపీ స్థాయిలో క్రైమ్ రివ్యూ మీటింగ్ ని వర్చువల్‌గా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.



## స్కూల్ బస్సు బోల్తా..

### విద్యార్థులకు స్వల్ప గాయాలు..

**జనపదం, హైదరాబాద్:** కాటేదాన్ టీఎన్జీవో స్ కాలనీ స్కూల్ బస్సు బోల్తాపడింది. స్థానిక మణికంఠ హిల్స్ లోని పయనీర్ కాన్సెప్ట్ హై స్కూల్ వద్ద బస్సు బోల్తా పడడంతో స్థానికులు, తల్లిదండ్రులు భయాందోళన చెందారు. స్కూల్ సమీపంలో వంపు గా ఉన్న ప్రాంతాల్లో డ్రైవర్ బస్సును నిలిపి ఉంచగా, పిల్లలు బస్సు ఎక్కారు. దీంతో బస్సు నెమ్మదిగా కదిలి ముందు నిలిపిన కారు, విద్యుత్ స్తంభాలను ఢీకొని పక్కకు ఒరిగింది. ప్రమాదంలో బస్సులో ఉన్న చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదమే తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 4 ఏండ్ల నిబంధన కొనసాగించలేం

- జీఓ 33పై స్పష్టతనిచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి
- కేటీఆర్ ట్విట్‌కు మంత్రి సమాధానం



**జనపదం, హైదరాబాద్:** వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33పై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు. జీఓ 33తో స్థానిక విద్యార్థులు నష్టపోతారంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలకు మంత్రి స్పందించారు. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించి 2017 జూలై 5న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 114 ని ప్రస్తావించిన మంత్రి రాజనర్సింహ, ఆ జీఓలోని 9 నుంచి 12 తరగతి వరకు చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణిస్తూ చేసిన క్లాజ్‌ను జీఓ 33లో కొనసాగించామని పేర్కొన్నారు. అయితే అదే జీఓలోని 6 నుంచి 12 వరకు కనీసం 4 ఏళ్లు విద్యార్థులు చదివిన ప్రాంతానికి స్థానికతను వర్తింపజేయాలన్న నిబంధనను కొనసాగించలేమన్నారు. జీఓ 114లోని ఈ నిబంధన ప్రకారం విద్యార్థి 4 ఏళ్లు తెలంగాణలో, మిగిలిన మూడు సంవత్సరాలు ఏపీలో చదివితే అతన్ని తెలంగాణ స్థానికుడిగా పరిగణించారని గుర్తు చేశారు. అయితే ఏపీ పునర్వ్యవస్థీకరణ యాక్ట్ ప్రకారం పదేళ్లు పూర్తైన నేపథ్యంలో నిబంధనను కొనసాగించలేమని పేర్కొన్నారు.

### తీరని అన్యాయం అన్న కేటీఆర్

అంతకుముందు తెలంగాణ విద్యార్థులకు మెడిసిన్ సీట్ల అంశంపై ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ ఉత్తర్వులు అమలు చేస్తే, తెలంగాణ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన 33వ నెంబర్ జీవో ప్రకారం రాష్ట్రంలో 9నుంచి 12వ తరగతి వరకు చదివిన విద్యార్థులు స్థానికులవుతారని కేటీఆర్ వివరించారు. అప్పుడు హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు, ఇక్కడ స్థానికులవుతారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇక ఇతర రాష్ట్రాల్లో 9 నుంచి 12వ తరగతి చదివే తెలంగాణ విద్యార్థులు తమ సొంత రాష్ట్రంలోనే స్థానికేతరులవుతారని వివరించారు.

## ఎకో టూరిజం పాలసీలు ఖరారు చేయాలి

### మంత్రి కొండా సురేఖ



**జనపదం, హైదరాబాద్:** పర్యావరణానికి హాని కలగకుండా, స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు అటవీశాఖకు లబ్ధి చేకూరేలా ఎకో టూరిజం పాలసీని ఖరారు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. పాలసీ రూపకల్పనలో భాగంగా పలు శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి, రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించే దిశగా సమర్థవంతమైన ఎకో టూరిజం పాలసీని తెస్తున్నామన్నారు. టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యతనిచ్చినట్లుగానే, ఎకో టూరిజంలో భాగంగా వాటర్ టూరిజానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ దిశగా 30 నుంచి 40 సైట్లను గుర్తించినట్లు అధికారులు మంత్రికి వివరించగా, అటవీశాఖ పరిధిలో ఉన్న పర్యావరణహిత అనుకూలత కలిగిన సైట్లను ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. కర్ణాటక, ఒడిశాలో అమలు చేస్తున్న ఎకో టూరిజం పాలసీలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ రెండు రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పాలసీలకు మధ్యస్థంగా తెలంగాణ ప్రాంత పరిస్థితులకు అనువైన పాలసీని రూపొందించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ఇందు కోసం ఎన్ఆర్ఐల సహకారం తీసుకోవాలన్నారు. స్థానికులకు ఉపాధిని పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పర్యాటకులకు ఎకో టూరిజం స్పాట్ల సమస్త సమాచారం, ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కల్పిచేలా యాప్, వెబ్‌సైట్స్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు.



## ప్రైవేటు ట్రావెల్స్‌లో భారీగా బంగారం పట్టివేత

**జనపదం, సంగారెడ్డి:** ప్రైవేటు ట్రావెల్స్ లో భారీగా బంగారం పట్టుబడింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకపోవడంతో చంద్రేష్ అనే వ్యక్తి నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారు 4.8 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే చంద్రేష్ వీటినిముంబయి నుంచి హైదరాబాద్‌కు వీటిని తరలిస్తున్నట్లుగా గుర్తించారు. బంగారంతో పాటు, దాన్ని తరలిస్తున్న వ్యక్తిని సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## విశ్వనగరానికి వాటర్ సప్లై ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్..

### 2030 నాటి అవసరాల మేరకు ఏర్పాట్లు

**జనపదం, సిటీబ్యూరో:** హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను మెరుగుపరిచేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్–2కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం జీవో జారీ చేశారు. రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులో నగరానికి అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను సైతం నింపనున్నది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో పనులు పూర్తి చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. 2030 నాటికి నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని 170 ఎంజీడీల అదనపు జలాల్ని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇందుకోసం గోదావరి నుంచే 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉన్నది. 2030 నాటికి హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీలకు పెరుగుతుందని అంచనా. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండబోతున్నది. ఫేజ్–1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. తాజాగా పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా.. మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వాప్కోస్ కంపెనీ సిద్ధం చేసింది. ఇందులో పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3600 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. ఘన్‌పూర్, శామీర్‌పేట వద్ద 780 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

## బెయిలెప్పుడో...?



**(మొదటిపేజీ తరువాయి)** ఇటు సన్నిహితులు, కుటుంబ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

### ఉపసంహరణ..

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇప్పట్లో తీహార్ జైలు నుంచి బయటికి వచ్చే మార్గాలు కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. రౌస్ అవెన్యూ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. నిన్న రౌస్ అవెన్యూ కోర్టులో కవిత డిఫాల్ట్ బెయిల్ కేసు విచారణ వాయిదా పడింది. కవిత తరపు న్యాయవాదులు విచారణకు హాజరుకాకపోవడంతో జడ్జి కావేరి బవేజా అసహనం వ్యక్తం చేసి, వాదనలకు రాకపోతే పిటిషన్ ఉపసంహరించుకోవాలని సూచిస్తూ కేసును వాయిదా వేస్తూ తుది విచారణ జరుపుతామని చెప్పారు. కాగా, సీబీఐ చార్జ్ షీట్‌లో తప్పులు ఉన్నాయని కవిత న్యాయవాదులు జూలై 6వ తేదీన డిఫాల్ట్ బెయిల్ కోసం పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. అయితే చార్జ్ షీట్ లో ఎలాంటి తప్పులు లేవని సీబీఐ చెప్పడంతో జూలై 22న సీబీఐ చార్జిషీట్ ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ నెల 9న చార్జ్ షీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది. ఇప్పటికే బెయిల్ పిటిషన్‌ను పలుమార్లు పక్కనెట్టిన రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. అది మంగళవారమైనా విచారణకు వస్తుందనుకుంటే రౌస్ అవెన్యూ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు.

### అరెస్టు.. బెయిల్ పిటీషన్లు..

ఎమ్మెల్సీ కవితను మార్చి 15వ తేదీన ఈడీ, ఏప్రిల్ 11వ తేదీన సీబీఐ అరెస్టు చేశాయి. అప్పటి నుంచి కవిత బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో కవిత సవాల్ చేశారు. ఆమెకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. దీంతో ట్రయల్ కోర్టులోనే కవిత మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. జూలై 22వ తేదీన విచారించిన జడ్జి కావేరి బవేజా కేసును ఆగస్టు 5కు వాయిదా వేయగా, నిన్న కవిత తరఫున న్యాయవాదులు విచారణకు హాజరు కాలేదు. పైగా మంగళవారం కవిత డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం తీవ్ర చర్చనీయాంశం అయింది.

## షాద్ నగర్ బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

### ప్రజా ప్రభుత్వంలో ఇష్టారాజ్యాన్ని సహించం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జనపదం, రంగారెడ్డి:** షాద్ నగర్ పట్టణ పోలీసులు చోరీ కేసులో దళిత మహిళ ను పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి శిక్షించిన.. అంశంపై అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం స్పందించారు. కేసు పూర్వపరాలు తెలుసుకొని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, దళిత కుటుంబానికి అండగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడారు. సీఎం చెప్పిన వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత పోలీసు సిబ్బంది, అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఒక సీఐ సహా ఆరుగురు సిబ్బందిని వెనువెంటనే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో షాద్ నగర్ వంటి సంఘటనలను సహించేది లేదని డిప్యూటీ సీఎం పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి వైద్య సహాయంతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాల అండగా నిలుస్తామని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారుల ద్వారా బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని పోలీసు ఉన్నత అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

## ఠాణాలో పందెం కోళ్ల వేలం

- పోటీ పడి పాట పడిన కొనుగోలుదారులు
- వేలల్లో ధర పలికిన కోళ్లు..
- ఎగబడి చూసిన జనం



**జనపదం, పెద్దపల్లి:** కోళ్ల పందెలు ఆడుతున్న వారిని కట్టడి చేయాల్సిన పోలీసులే పందెం కోళ్లను అధికారికంగా అమ్మకానికి పెట్టారు. ఠాణా వేదికగా.. అధికారిక వేలం పాటలు పాడారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఈ ఘటనకు అడ్డాగా నిలిచింది. ఇటీవల కోడిపందెలు ఆడుతున్న ము గ్గ్రిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఆ రెండు కోళ్ల అమ్మకానికి ఇవాళ వేలం పాట నిర్వహించారు. ఎంతో ఆసక్తికరంగా జరిగిన ఈ వేలం పాటలో 20 మంది పాల్గొనగా.. దీన్ని చూసేందుకు స్థానికులు భారీగా తరలిరావడంతో అక్కడ హడావుడి నెలకొంది. ఈ రెండు కోళ్లకు వేర్వేరుగా వేలం పాట నిర్వహించగా రెండు పందెం కోళ్లకు రూ, 6,500 లు ధర పలికింది. ఇందులో 2 కిలోల 980 గ్రాముల బరువు ఉన్న పందెం కోడికి రూ, 1341 లుగా, 2 కిలోల 410 గ్రాములు గల పందెం కోడికి రూ, 1085 మార్కెట్ ధరగా పోలీస్ శాఖ నిర్ధారించింది. ఈ మేరకు ఈ పందెం కోళ్లకు నిర్ధారించిన ధర ఎవరు ఎక్కువ పాట పాడితే వారే ఈ పందెం కోళ్లు కైవసం చేసుకుంటారని ఎస్సై చంద్రశేఖర్ వెల్లడించారు. అనంతరం రెండు పందెం కోళ్లలో వేర్వేరుగా వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పాల్గొన్న పలువురు పోటాపోటీగా పాట పాడారు. వీరిలో 2 కిలోల 980 గ్రాముల బరువు గల పందెం కోడిని రూ.4వేలకు పురాణం సారయ్య దక్కించుకున్నారు. అలాగే 2 కిలోల 410 గ్రాముల బరువు గల మరో పందెం కోడిని రూ, 2500 లకు కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన బోనాల సత్యనారాయణ దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో వచ్చిన డబ్బులను మంథని కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



## రాష్ట్రపతికి ఫిజీ దేశ అత్యున్నత పౌర పురస్కారం

**జనపదం, ఢిల్లీ:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిజీ దేశ అత్యున్నత పౌర పురస్కారం "కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీని" అందుకున్నారు. రెండు రోజుల ఫిజీ పర్యటనకు వెళ్లిన ముర్ముకు ఆ దేశ అధ్యక్షుడు విలియమ్ కటోనివేరే ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ద్వీప దేశమైన ఫిజీలో భారత రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి. ఫిజీ, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. ఫిజీకి మిత్రదేశంగా ఉండటానికి భారత్ సిద్ధంగా ఉందని ఆ దేశ పార్లమెంట్‌లో పేర్కొన్నారు. తనకు లభించిన పురస్కారాన్ని రెండు దేశాల మధ్య ఉన్న గొప్ప స్నేహ బంధానికి ప్రతిబింబంగా ద్రౌపదీ ముర్ము అభివర్ణించారు. ఫిజీ పర్యటన అనంతరం ఆగస్టు 7 నుంచి 9 వరకు న్యూజిలాండ్‌లో రాష్ట్రపతి పర్యటించనున్నారు.

Revanth Reddy
@revanth_anumula

పాటకు పోరాటం నేర్పి...
తన గళంలో తూటాగా మార్చి...
అన్యాయం పై ఎక్కుపెట్టిన...
తెలంగాణ సాంస్కృతిక శిఖరం...

గద్దరన్న వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను.

#RememberingGaddar #Gaddar

Translate post



## యుద్ధనౌక గద్దరన్న..

- పాట ఉన్నంత వరకు మన యాదిలోనే..
- సాంస్కృతిక సేవలకు గుర్తింపుగానే గద్దర్ అవార్డుల ప్రదానం..
- సీఎం రేవంత్ రెడ్డి
- వర్ధంతి సందర్భంగా గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి...

**జనపదం, హైదరాబాద్ :** పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం మంగళవారం గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం పాటలతో ప్రజలను చైతన్యపర్చారన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జన సభతో పాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో గద్దర్ అతి ప్రముఖుడని సీఎం గుర్తు చేసుకున్నారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రత్యేకంగా గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.


## రాజధానిలో పోరాటం..

- ఢిల్లీలో న్యాయపోరాటం..
- అనర్హత వేటా..ఉప ఎన్నికలకు చోటా
- న్యాయ నిపుణులతో చర్చలు
- ఏదైనా ఎంతైనా ఫర్వాలేదు... అనర్హత వేటుకే ప్రాధాన్యం..

**జనపదం, ఢిల్లీ :** ఉప ఎన్నికలతో రాజకీయ వేడిని రాజేయడంలో దిట్ట అయిన భారత రాష్ట్ర సమితి అగ్రనాయకత్వం ఇప్పుడు ఢిల్లీలోనే మాకం వేసింది. పార్టీ ఫిరాయించిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు ప్రతీ అవకాశాన్ని వాడుతున్నారు. ఇందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఇదివరకే నిర్ణయించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే ఢిల్లీలోని కీలక న్యాయ నిపుణులతో సంప్రదింపుల ప్రక్రియ పూర్తి చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పడేలా న్యాయపరమైన అంశాల బిజీలో నేతలున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు సహా ఆరడజను మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. దానం, కడియం, వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ కోరింది. ఆయన చర్యలు తీసుకోవడం లేదంటూ కోర్టుకు వెళ్లారు. స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో అనర్హత వేటు వేయాలన్న సుప్రీంకోర్టు తీర్పులను స్పీకర్ అమలు చేయడం లేదని హైకోర్టుకు తెలిపారు. వారి వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. అయితే ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. మరికొంత మంది చేజారకుండా ఈ అస్త్రాన్ని వాడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# హైదరాబాద్ కు ఆర్సీసీఎం..

- అమెరికా తర్వాత భాగ్యనగరానికి కంపెనీ..
- విస్తరణకు రాష్ట్ర సర్కార్ తో అంగీకారం..
- స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగాలు
- ఐటీలో వృద్ధే సర్కార్ లక్ష్యమన్న సీఎం రేవంత్
- బృదంతో కలిసి యూఎస్ లో పర్యటన..
- ఆర్సీసీఎం సీఈవో గౌరవ్ సూరీతో ఒప్పందం..



**జనపదం, హైదరాబాద్ :** ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం ఆయా కంపెనీలతో చర్చిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆర్సీసీఎం కంపెనీ ప్రతినిధులతో చర్చలో పాల్గొన్నారు. కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తప్పకుండా సహకరిస్తుందని, బ్యాంకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ రంగంలో హైదరాబాద్ పే కొత్త ఆవిష్కరణ కేంద్రంగా నిలబెడుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారుల బృందం ఆర్సీసీఎం సీఈవో గౌరవ్ సూరి నేతృత్వంలో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు.

**హైదరాబాద్ కేంద్రంగా..**

టెక్నాలజీ, సర్వీస్ సొల్యూషన్స్ లో పేరొందిన ఆర్సీసీఎం కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించనుంది. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఆర్సీసీఎం మొదటి సారిగా హైదరాబాద్ లో తమ ఆఫీసును విస్తరించనుంది. అమెరికా తర్వాత విదేశాల్లో కంపెనీ పెట్టడం ఇదే మొదటి సారి. ప్రపంచ వ్యాప్తంగా తమ సేవల విస్తరణకు హైదరాబాద్ సెంటర్ కీలకంగా నిలుస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది. కాగా, డీఈ షా గ్రూప్, బ్లాక్‌స్టోన్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ మద్దతుతో ఆర్సీసీఎం స్వతంత్ర సంస్థగా ప్రారంభమైంది. బ్యాంకులు, హెడ్జ్ ఫండ్‌లు, సంస్థాగత ఆస్తుల నిర్వాహకులు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు సంబంధించిన డేటాతో పాటు కార్యకలాపాలపై కంపెనీ విశ్లేషణలు అందిస్తుంది. పైగా ప్రత్యేకంగా డేటా మేనేజ్మెంట్, డేటా స్ట్రాటజీలో కంపెనీకి గుర్తింపు ఉంది. అనంతరం ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సాంకేతిక వృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య సహకారం తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఆర్సీసీఎం లాంటి కంపెనీలకు తగినంత మద్దతు పాటు మౌలిక సదుపాయాలను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి టెక్ కంపెనీలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారుతుందని అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు నైపుణ్యమున్న మానవ వనరులుండటంతో హైదరాబాద్ ను అంతర్జాతీయ కార్యకలాపాలకు అనువైన ప్రదేశంగా ఎంచుకున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ సీఈవో గౌరవ్ సూరీ తెలిపారు.

## 15న మూడో విడుత రుణమాఫీ

- వైరాలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 6 వేల మంది రైతులకు, రూ.6 వేల కోట్లు..
- ప్రతిపక్షాలవి అనవసర ఆరోపణలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**జనపదం, హైదరాబాద్:** మూడో విడత రుణమాఫీని ఈ నెల 15న చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకల రోజున వైరాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రుణమాఫీని ప్రారంభిస్తారని చెప్పారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాల విడుదల కార్యక్రమానికి సంబంధించిన సభలోనే రుణమాఫీ ప్రారంభిస్తారని మంత్రి వెల్లడించారు. మూడో విడతలో సుమారు 6 వేల మంది రైతులకు, దాదాపు రూ.6 వేల కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే సాంకేతిక కారణాల వల్ల రెండు విడతల్లో 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని, పొరపాట్లన్నీ సరి చేసి అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రుణమాఫీపై ఆరోపణలు, అనుమానాలు, అసత్య ప్రచారం చేయడం సరికాదని అన్నారు. రుణమాఫీపై రాజకీయ విమర్శలు దురదృష్టకరమన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతాంగాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు. ప్రక్రియ పూర్తి కాకముందే విమర్శలు చేయవద్దన్న ఆయన, రుణమాఫీకి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించి రైతుల మనోభావాలను దెబ్బ తీయవద్దని హితవు పలికారు.

**రుణమాఫీ కాకపోయినా ఆందోళన వద్దు**

రుణమాఫీ కాలేదని అన్నదాతలు ఆందోళన చెందొద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని చెప్పారు. ఎన్ని కష్టాలున్నా ఈ అంశంలో ముందుకెళ్తున్నామని, ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నామని చెప్పారు. పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నాం. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గతంలో రుణమాఫీ సరిగా జరగలేదన్న భావన రైతుల్లో ఉందని తుమ్మల అన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మి రుణమాఫీ చేయాలని గత ప్రభుత్వం ఆలోచించిందని విమర్శించారు. గత పాలకులు సరైన పద్ధతిలో రుణమాఫీ చేయకపోయినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రం విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ద్వారా రాజకీయ లబ్ధి పొందలేరని ఆయన వ్యాఖ్యానించారు.

## ప్రొటోకాల్ మారుద్దా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులను పదే పదే అవమానించడం సరికాదని, ప్రజలెన్నుకున్న నాయకులకు నిబంధనల ప్రకారం అన్ని మర్యాదలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**విషయమిది..**

రాజోలి మండలంలోని తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్లను ఎమ్మెల్యే విజయుడు మంగళవారం స్విచ్చాన్ చేసి నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి ఆర్డీఎస్ కాలువ వద్దకు వెళ్లారు. అయితే మోటార్లు ఆన్ చేసి సుమారు మూడు గంటలు గడుస్తున్నా నీరు చేరుకోకపోవడంతో వారికి అనుమానం వచ్చింది. అయితే విజయుడు మోటార్లు ప్రారంభించిన కొద్ది సేపటికే మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు సంపత్ మోటార్లను ఆఫ్ చేశారు. దీంతో ఆర్డీఎస్ కాలువకు నీరు నిలిచిందని తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వర్షాలు కురవక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల పరిష్కారం చూపడానికి సాగునీటిని విడుదల చేస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం బాధాకరం అన్నారు. అధికార పార్టీ చేసిన అవమానాన్ని నిరసిస్తూ రైతులతో కలిసి తుమ్మిళ్ల లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్టు వద్దకు రోడ్డుపై భైఠాయించారు. పోలీసులు విజయుడిని అరెస్టు చేసి అక్కడ నుంచి త రలించిన విషయం తెలిసిందే.

## జయహో జయశంకర్ సర్..

**నివాళులర్పించిన ఎమ్మెల్యే హరీశ్ రావు**



**జనపదం, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీ ఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త, ఉద్యమ భా వజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన మహనీయులంటూ ఎక్స్ వేదికగా ఆ యన పోస్టు చేశారు. సారు చూపిన మా ర్గంలో, కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో సార్‌ది ప్రత్యేక స్థా నమని వెల్లడించారు. ఆయనను స్ఫూ ర్తిగా తీసుకోవాలన్నారు. జయహో జయశంకర్ సర్.. పిడికిలెత్తి పలుకుతోంది తెలంగాణ జోహార్ అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చారు.





# జనంలో జెండా..పార్టీ అజెండా

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- స్థానిక ఎన్నికలకు బీజేపీ యాక్షన్ ప్లాన్

**జనపదం, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సమాయత్తం అవుతోంది. గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించింది. ఈ నెల మొత్తం లీడర్, క్యాడర్ జనాల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించింది. సంస్థాగతంగా పార్టీ నిర్మాణమయ్యేలా ప్రత్యేక ప్లాన్ రెడీ చేసింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా ఈ యేడాది కూడా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని, ఇందుకు గాను బుధవారం అన్ని జిల్లాల్లో కార్యక్రమ నిర్వహణ కోసం విధివిధానాలపై చర్చించాలని నిర్ణయించారు. 8, 9 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమం నిర్వహించాలని కిషన్ రెడ్డి తెలిపారు. 10, 11 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద శుభ్రం చేసి మహనీయులకు నివాళులర్పించాలని, స్మారక చిహ్నాల వద్ద 'స్వచ్ఛ భారత్' లో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 11, 13 తేదీల్లో జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ కేంద్రాలు, ప్రతి మండలం, మున్సిపాలిటీల స్థాయిలో యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించాలని సూచించారు. 12న మహిళా మోర్చా ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళలతో బైక్ ర్యాలీల నిర్వహణ, ఆగస్టు 13, 14,15 తేదీల్లో ప్రతి కార్యకర్త ప్రతి ఇల్లు, భవనాన్ని సందర్శించి, ప్రజలందతా 'హర్ ఘర్ తిరంగ'లో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. 13న రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని ప్రముఖ, ప్రసిద్ధగాంచిన ప్రాంతాల్లో సంఘసేవకులు, ప్రముఖులను సమీకరించి, సామూహికంగా జాతీయ గీతాలాపన, 14న విభజన గాయాల స్మారక దినం, జిల్లా కేంద్రాల్లో హాల్ మీటింగ్స్ నిర్వహించి ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపడుతామన్నారు. 15న రాష్ట్రంలో ప్రతి బూత్ లో, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని కిషన్ రెడ్డి సూచించారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ అర్హులైన రైతులందరికీ అమలు చేయకుండా మోసం చేసిందని, రుణమాఫీ కాని రైతులకు అండగా నిలిచేలా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కు అద్భుత స్పందన వస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. రచ్చబండ కార్యక్రమాల అనంతరం రైతుల సమస్యల పరిష్కారం కోసం, రైతులకు ఇచ్చిన 7 ప్రధాన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రశ్నించేలా, గోసపడుతున్న రైతులకు న్యాయం జరిగేలా సమావేశాలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



## వెరీ గ్రేట్..సార్..

**రాజ్ భవన్ లో జయశంకర్ జయంతి..**

రాజ్ భవన్ లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పోషించిన పాత్రను గవర్నర్ కొనియాడారు. -జనపదం, బ్యూరో



## నాగార్జునసాగర్‌కు పోటెత్తిన వరద..

**22 గేట్లను ఎత్తిన అధికారులు**

**జనపదం, హైదరాబాద్ :** ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో సాగర్ నిండు కుండలా మారింది. సాగర్ కు కృష్ణమ్మ పోటెత్తడంతో వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు 22 గేట్లను 5 ఫీట్ల మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 985.30 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నిల్వ 298.30 టీఎంసీలు ఉన్నది. ప్రస్తుతం జలాశయానికి 3,74,649 క్యూసెక్కులు ఉండగా.. అవుట్ ఫ్లో 3,54,684 క్యూసెక్కులుగా ఉన్నది. మరో వైపు ఎగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి సైతం వరద కొనసాగుతున్నది. దీంతో పదిగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్ గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు.. ప్రస్తుతం 883 అడుగుల మేర నీరు చేసింది. ప్రస్తుతం డ్యామ్‌లో 204.35 టీఎంసీలు నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమ గట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.




## రెండు రోజులు భారీ వర్షాలు..

**ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడురోజుల్లో స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో పలుచోట్ల వీచే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఉమ్మడి మహబూబ్ నగర్ , భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది.. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, వనపర్తి, మెదక్, నల్గొండ, వరంగల్, సిద్దిపేట, మహబూబాబాద్, కొత్తగూడెంతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజెర్లలో 148 మిల్లీమీటర్లు, తల్లాడలో 120 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ పేర్కొంది.

## నా స్థానంలో ఒక్క రోజు కూర్చుంటే తెలుస్తుంది..

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్
- న్యాయవాదుల తీరుపై అసహనం..




**జనపదం, ఢిల్లీ:** ప్రతీ న్యాయవాది తమ కేసునే మొదట విచారణ జరపాలంటూ కోరడం పట్ల సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. అంతా తమ పిటిషన్ ముందుగా విచారణకు రావాలని కోరుతున్నారని, కానీ తమపై ఉన్న ఒత్తిడిని మాత్రం అర్థం చేసుకోవడంలేదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై తాము విచారణ జరుపుతామని, అందుకు ఒక తేదీ ఇస్తామన్నారు. న్యాయమూర్తులను, కోర్టును శాసించే పరిస్థితులు సరికాదని సీజేఐ స్పష్టంచేశారు. దేశంలోని కోర్టులు, న్యాయమూర్తులపై ఎంత ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్కరోజు తన స్థానంలో కూర్చుంటే, మరోసారి జీవితంలో ఆ స్థానానికి రాకుండా పారిపోతారని స్పష్టంచేశారు. మంగళవారం ఒక కేసు విషయంలో జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి న్యాయవాది తమ కేసునే మొదట విచారణ జరపాలంటూ కోరడం పట్ల సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. అంతా తమ పిటిషన్ ముందుగా విచారణకు రావాలని కోరుతున్నారని, కానీ తమపై ఉన్న ఒత్తిడిని మాత్రం అర్థం చేసుకోవడంలేదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై తాము విచారణ జరుపుతామని, అందుకు ఒక తేదీ ఇస్తామన్నారు. న్యాయమూర్తులను, కోర్టును శాసించే పరిస్థితులు సరికాదని సీజేఐ స్పష్టంచేశారు.



# దసరా మేకర్స్‌తో విశ్వక్ సేన్

టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ ప్రస్తుతం రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో మెకానిక్ రాకీ సినిమాలో నటిస్తున్నాడు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వక్‌సేన్ తాజాగా కొత్త సినిమా VS-13 వార్తను అందరితో పంచుకున్నాడు. నానితో దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్‌ను అందించిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ VS-13ను తెరకెక్కిస్తోంది. విశ్వక్‌సేన్ వైట్ షర్ట్ అండ్ ఖాకీ ప్యాంట్‌లో పిస్తోల్‌తో గ్యాంగ్ వార్‌ను నియంత్రించే పోలీస్‌గా కనిపిస్తున్న హాఫ్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. హిట్ తర్వాత మరోసారి పోలీసాఫీసర్‌గా గెటప్‌లో విశ్వక్‌సేన్ కనిపించబోతున్నాడు.




# మొదలైన తెలుసు కదా

**డీజే టిల్లు ఫేమ్ సిద్ధూ జొన్నలగడ్డ** తన లాస్ట్ రెండు సినిమాలతో సాలిడ్ హిట్స్ అందుకున్నాడు. ఇక ఈ చిత్రాలు తర్వాత మరో రెండు సినిమాలు టిల్లు క్యూబ్ కాకుండా చేస్తున్నాడు. వీటిలో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ఇప్పుడు షూటింగ్ షురూ చేసుకుంది. టాలీవుడ్ ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో చేస్తున్న మొట్టమొదటి సినిమానే "తెలుసు కదా". అనౌన్స్ చేసిన నాటి నుంచే డీసెంట్ బజ్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రం ఇప్పుడు షూటింగ్ ని స్టార్ట్ అయినట్లు మేకర్స్ అప్డేట్ అందించారు. షూటింగ్ మొదలు కాగా 30 రోజులు పాటుగా కొనసాగనుంది. అలాగే ఈ చిత్రంలో రాశి ఖన్నా, కేజీఎఫ్ చిత్రాల నటి శ్రీనిధి శెట్టి ఇద్దరు కలిసి నటించనున్నారు.

# మురారి రీ-రిలీజ్

**సూపర్ స్టార్ మహేష్ బాబు** హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో తెరకెక్కిన మురారి చిత్రం రీ-రిలీజ్‌కు రెడీ అయింది. మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 9 వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ టికెటింగ్ యాప్ అయిన బుక్ మై షోలో ఈ చిత్రం ట్రెండ్ సెట్ చేస్తోంది. ఇప్పటి వరకూ ఏ రీ-రిలీజ్ కి సాధ్యం కానీ రికార్డును క్రియేట్ చేసింది. రిలీజ్ కి ముందే 2 కోట్ల రూపాయల గ్రాస్‌ను వేగవంతంగా రాబట్టిన చిత్రంగా నిలిచింది. సోనాలి బింద్రే, లక్ష్మి, కైకాల సత్యనారాయణ, గొల్లపూడి మారుతీరావు తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ అద్భుతమైన సంగీతం అందించారు. రీ-రిలీజ్ కి ఇంకా 3 రోజుల సమయం ఉండటంతో సినిమా మరింత టార్గెట్‌ను సెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.






# ఓజీ నుంచి త్వరలో పవర్ ప్యాక్


పవర్ స్టార్ పవన్ కల్యాణ్ యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో 'OG' (ఒరిజినల్ గ్యాంగ్ స్టర్) మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా నుంచి పవన్ పుట్టినరోజున ఓ క్రేజీ అప్డేట్ రానున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ పుట్టిన రోజు ఆయన ఫ్యాన్స్ ఓ పండగలా జరుపుకుంటారు. అలాగే ఆయన పుట్టిన రోజున సినిమా నుంచి ఏదైనా అప్డేట్ ను కోరుకుంటారు. గతేడాది పవన్ పుట్టినరోజు( సెప్టెంబరు 2)న 'OG' నుంచి 'హంగ్రీ చీతా' అంటూ ఓ గ్లింప్స్ ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ గ్లింప్స్ ఫ్యాన్స్‌కు పునకాలు తెప్పించింది. ఆ తర్వాత పవన్ రాజకీయాల్లో బిజీ కావడం వల్ల షూటింగ్‌కు బ్రేక్ పడి సినిమా నుంచి అప్డేట్స్ రాలేదు. అలాగే ఇంకా సినిమా షూటింగ్ పూర్తి కాకపోవడం వల్ల వచ్చే ఏడాది ప్రారంభంలో మూవీ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పవన్ బర్త్ డేకి డైరెక్టర్ సుజీత్ ఓ పవర్ ప్యాక్ వీడియోను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోను తీర్చిదిద్దే పనిలో సుజీత్ ఉన్నట్లు సమాచారం. ఈ వీడియోను పవర్ స్టార్ అభిమానులను నచ్చుతుందని, పూనకాలు తెప్పిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఇప్పటి నుంచే కామెంట్లు చేస్తున్నారు.



# 31న ప్రశాంత్ నీల్.. తారక్ మూవీ లాంచ్

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర మూవీతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక తారక్ మరోవైపు ప్రశాంత్ నీల్ తో ఎన్టీఆర్ 31 చేయనున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత తాజాగా ఈ భారీ సినిమాకు సంబంధించిన వార్త నెట్టింట వైరల్ అవుతూ అభిమానులను ఖుషీ చేస్తోంది. తారక్ ఎన్టీఆర్ 31 సినిమా లాంచింగ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ మూవీని ఆగస్టు 9న ఘనంగా ప్రారంభించేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌కు డ్రాగన్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే ఆన్‌లైన్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ప్రశాంత్ నీల్ సలార్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఈ ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ సీక్వెల్ సలార్ 2పై ఫోకస్ పెట్టాడని ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. తారక్ కూడా దేవర, వార్ 2 సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాల షూటింగ్‌పై క్లారిటీ వచ్చిన తర్వాత ఎన్టీఆర్ 31 రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ పై స్పష్టత రానుందని సమాచారం.





# ప్రపంచ నెంబర్1ను మట్టికరిపించి..

**క్వార్టర్ ఫైనల్స్‌కు భారత రెజ్లర్ వినేష్ ఫోగట్**

**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ యువీ సుసాకిని ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ ప్రవేశించింది. ఇక ఫోగల్ పతకానికి అడుగు దూరంలోనే ఉంది. సెమీఫైనల్స్‌లో గెలిస్తే స్వర్ణం లేదా రజత పతకాలను గెలుచుకునే అవకాశం ఉంది. సెమీస్‌లో ఓడితే కాంస్య పతకపోరులో తలపడాల్సి వస్తుంది. మంగళవారం జరిగిన మొదటి పోరులో టోక్యో ఒలింపిక్స్ బంగారు పతక విజేతతో పాటు నాలుగు సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన జపాన్ క్రీడాకారిణి యువీ సుసాకిని 3-2తో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. మొదట వినేష్ 0-2తో వెనుకబడి ఉంది. కానీ చివరి నిమిషంలో పుంజుకుని ఓటమిని విజయంగా మార్చుకుంది.



# టీటీ క్వార్టర్స్‌లో శ్రీజ బృందం

**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్ లో వ్యక్తిగత విభాగాల్లో నిరాశపరిచిన భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఇప్పుడు టీమ్ ఈవెంట్లలో రాణించేందుకు రెడీ అయ్యారు. మనికా బత్రా, తెలుగమ్మాయి ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత మహిళల జట్టు టీమ్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరింది. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో భారత్ 3-2తో రొమేనియాను ఓడించింది. మొదట డబుల్స్‌లో శ్రీజ-అర్చన జోడీ.. తర్వాత సింగిల్స్ మనికా నెగ్గారు. ఆ తర్వాత వరుస సింగిల్స్‌లో శ్రీజ, అర్చన ప్రత్యర్థుల చేతిలో ఓడారు. దీంతో నిర్ణాయక ఆఖరి సింగిల్స్‌లో మనికా మ్యాచ్ గెలిచి భారత్‌కు క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసింది. క్వార్టర్స్‌లో అమెరికా లేదా జర్మనీతో భారత్ తలపడనుంది.

# దటీజ్ నీరజ్..

## జావెలిన్ త్రోలో రికార్డ్ బ్రేక్

## క్వాలిఫికేషన్ రౌండ్ నుంచే ఫైనల్ కు..

జనపదం, స్పోర్ట్స్: పారిస్ 2024 ఒలింపిక్స్ లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన డిఫెండింగ్ ఛాంపియన్ నీరజ్ చోప్రా.. తన సత్తా ఎంతో మరోసారి ప్రపంచానికి చూపించాడు. జావెలిన్ త్రోలో మొదటి అటెంప్ట్‌తోనే ఫైనల్‌కు దూసుకెళ్లిపోయారు. మంగళవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 26 ఏళ్ల నీరజ్ చోప్రా.. అబ్బురపోయే ప్రదర్శన చేశాడు. తన తొలి త్రోతోనే ఏకంగా 89.34 మీటర్లు విసిరి.. అందరినీ ఆశ్చర్యపోయేలా చేశాడు. ఇతర అథ్లెట్లు జావెలిన్ త్రోను 85 మీటర్ల దూరం విసిరేందుకు తంటాలు పడిగా.. నీరజ్ చోప్రా మాత్రం అలవోకగా తన కెరీర్‌లోనే రెండో బెస్ట్‌ను నమోదు చేశాడు. దీంతో.. నీరజ్ చోప్రా డైరెక్టుగా ఫైనల్ బెర్త్ సొంతం చేసుకున్నాడు. ఇక ఇదే పోటీల్లో భారత్ నుంచి మరో ప్లేయర్ పాల్గొనగా.. ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాడు. మరో భారత ప్లేయర్ అయిన కిశోర్ కుమార్ తన బెస్ట్ అందించినప్పటికీ.. ఫైనల్‌కు మాత్రం అర్హత సాధించలేకపోయాడు. అత్యుత్తమంగా 80.73 మీటర్ల త్రో విసిరిన కిశోర్ కుమార్.. 9వ స్థానంలో నిలిచాడు. దీంతో క్వాలిఫికేషన్ రౌండ్ నుంచే కిశోర్ కూమార్ నిష్క్రమించాడు. అయితే.. జావెలిన్ త్రో ఫైనల్.. ఆగస్టు 8వ తేదీన జరగనుంది. తొలి అటెంప్ట్‌తోనే ది బెస్ట్ ఇచ్చిన నీరజ్ చోప్రా.. ఫైనల్ రోజు ఎలాంటి ప్రదర్శన ఇవ్వనున్నాడన్నది.. ఇప్పుడు భారతదేశమే కాదు.. ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తోంది.



### గతంలోనూ..

టోక్యో 2020 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి.. భారత దేశ జెండాను ఎగరేసిన నీరజ్ చోప్రా.. భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికాడు. టోక్యో 2020 ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా 87.58 మీటర్ల త్రో విసిరి స్వర్ణం సాధించాడు. తాజాగా.. పారిస్ ఒలింపిక్స్‌లో ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఏకంగా 89.34 మీటర్లను నమోదు చేశాడు. అయితే నీరజ్ చోప్రా కెరీర్‌లో ఇది రెండో బెస్ట్ త్రో కావడం విశేషం. 2022 జూన్‌లో నీరజ్ చోప్రా.. 89.94 మీటర్ల దూరం బల్లెంను విసిరి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.



# రేపే ఆఖరి వన్డే..

## స్పిన్‌ను ఛేదిస్తేనే భారత్ విజయం

**జనపదం, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచ కప్ విజేత భారత జట్టుకు శ్రీలంక గడ్డపై కఠిన సవాల్ ఎదురవుతోంది. టీ20 సిరీస్‌ను 3-0తో గెలుపొందిన టీమిండియా వన్డే సిరీస్ లో లంక స్పిన్నర్ల ధాటికి తేలిపోతోంది. గెలవాల్సిన తొలి వన్డేను టైగా ముగించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారీ ఓటమి మూటగట్టుకుంది. కెప్టెన్ రోహిత్ శర్మ రెండు మ్యాచుల్లో అర్ధ శతకాలతో గట్టి పునాది వేసినా అనూహ్యంగా రెండింటా ఓడడం హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో పాటు కోట్లాది మంది అభిమానులను కలవరపెడుతోంది. పక్కా స్పిన్ పిచ్‌లను రెడీ చేసిన లంక మూడో వన్డేలో విజయంపై కన్నేయగా.. సిరీస్ సమం చేయడంపై రోహిత్ సేన దృష్టి పెట్టనుంది. ఒకవేళ మూడో వన్డేలోనూ గెలిస్తే లంక 27 ఏండ్ల తర్వాత భారత్‌పై ద్వైపాక్షిక సిరీస్ కైవసం చేసుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు మూడో వన్డే మొదలవ్వనుంది.

**బ్యాటింగ్ ఆర్డర్**

భారత బ్యాటింగ్ ఆర్డర్ ప్రధాన ఆందోళనగా కనిపిస్తోంది. 2023 ప్రపంచ కప్ సమయంలో బ్యాటింగ్ ఆర్డర్ స్థిరంగా ఉంది. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ నాలుగు, ఐదో స్థానా ల్లో కీలక పాత్ర పోషించారు. గంభీర్ కొత్త స్ట్రాటజీలో బ్యాటింగ్ ఆర్డర్‌లో తరచుగా మార్పులు ఉంటాయి. బ్యాటింగ్ ఆర్డర్ మారడం ఆటగాళ్ల ప్రదర్శనలను ప్రభావితం చేస్తోంది. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే ఆటగాళ్లు మెరుగ్గా రాణించేలా ఎక్కువ కాలం పాటు స్థిరమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను కొనసాగించాలి.

**స్పిన్‌తో తిప్పేస్తున్నారు...**

శ్రీలంక స్పిన్ బౌలింగ్‌కు భారత బ్యాటర్లు తడబడుతున్నారు. శ్రీలంక యంగ్ ఆల్ రౌండర్ దునిత్ వెల్లలాగే, లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే స్పిన్‌ని ఎదుర్కోలేక వికెట్లు సమర్పించుకుంటున్నారు. రెండో వన్డేలో వాండర్సే ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టాడు. టర్నింగ్ ట్రాక్‌లలో, కొత్త స్పిన్నర్‌లను ఎదుర్కోలేక కుప్పకూలడం ప్రధాన సమస్యగా మారింది. ఇక భారత జట్టులో జస్ప్రీత్ బుమ్రా లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది.